

# 13

## శీలా సుభద్రా దేవి

ఏమిటీ ఆవిడ ఈరోజు కూడా రాలేదు? 'ఆ బెంచీ వైపు చూస్తునే పార్కులో వాకింగ్ పాత్ మీద పదకొండో రౌండ్ తిరుగుతూ పదకొండోసారి అనుకుంది కౌసల్య. ఎందుకో మనసుకి వెలితిగా ఉంది. 'ఇన్నిరోజులు రాలేదంటే...' మరి ఊహించటానికి ధైర్యం కలగలేదు.

యాంత్రికంగా నడుస్తూనే పదిహేను రోజులక్రితం సంఘటన కళ్ళముందుకు తెచ్చుకుంది.

ఆరోజు ఎప్పటిలాగే వాకింగుకని పార్కుకి వచ్చింది కౌసల్య. పార్కునిండా రంగు రంగుల పూలచెట్లూ, వేప, రావిలాంటినీడనిచ్చే చెట్లే కాక వాకింగు చేసేవాళ్ళ సౌకర్యం కోసం గుండ్రంగా వాక్‌వే ఉంది. మధ్యలో పచ్చటి తివాసీ పచ్చిక. దానికి అంచులా రంగు రంగుల గులాబీ చెట్లు తలలూపుతూ పలకరిస్తున్నాయి. నడచి అలసిన వారికి సేద తీర్చేందుకు సిమెంటు బెంచీలు ఓ ప్రక్కగా చెట్లనీడన ఉన్నాయి. గుండెనిండుగా ఆక్సిజన్ పీల్చుకొని శరీరమంతటా చైతన్యాన్ని అద్దుకొనేందుకు ప్రతీరోజూ కనీసం ఓ పదినిముషాలన్నా వచ్చి పోవాలనిపించేలా ఉంటుంది ఆ పార్కు.

రోజూ అరగంటైనా నడవమని డాక్టరు ఇచ్చిన సలహా ప్రకారం రిటైరయిన తర్వాత ఆ పార్కుకి రావటం ప్రారంభించింది కౌసల్య. తరుచు చూడడం వల్ల చాలామంది ముఖపరిచయం అయింది.కాని స్నేహపరిచయాలు మాత్రం కౌసల్యకి కాలేదు.